ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 246
పేజీలు : 5 వెల రూ. 2/-
బుధవారం
24 డిసెంబర్ 2025
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## మాజీ ప్రధాని పివికి సిఎం రేవంత్ నివాళి



2 లో

5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా

# యూరియా యాప్

- యాప్ పనితీరు పట్ల రైతులు సంతృప్తి
- రెండురోజుల్లో యాప్ ద్వారా 60,510 బస్తాలు కొనుగోలు
- త్వరలో అన్ని జిల్లాలలో అమలుకు సన్నాహాలు



2 లో

తెలంగాణకు స్పష్టమైన విజన్

# తెలంగాణ రైజింగ్

- అన్ని శాఖలకు సంబంధించి పాలసీ
- క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు..
- ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట ఉద్యోగుల వివరాలు ఇవ్వండి
- అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలించండి
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచనలు..



**ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్23:** ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. అందుకే ముఖ్య మైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నాం. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యు మెంట్‌ను విడుదల చేశామన్నారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్ట మైన విధి విధానాలతో మేము ముందుకు వెళ్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ మిగతా 2లో..

# కెసిఆర్ ధోరణి మార్చుకో

- తోలు వలుస్తామంటే ఎవ్వరూ భయపడరు
- అలాంటి వారికి ప్రజలే బుద్ది చెబుతారు
- ఘాటుగా స్పందించిన డిప్యూటి సిఎం భట్టి

2 లో



# అక్రమ వసలదారులకు ట్రంప్ గాలం

- స్వచ్ఛందంగా అమెరికా వీడే వారికి 3వేల డాలర్ల తోఫా
- విమాన ప్రయాణం కూడా ఉచితమే



2 లో

# దమ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించండి

- నామినేటెడ్ పద్దతిలో భర్తీకి సర్కార్ యత్నం
- ఓటు వేసే సమయమొస్తే రైతులు కర్రుకాల్చి వాతలకు సిద్దం
- నల్లగొండలో సర్పంచ్‌ల సమావేశంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్
- కృష్ణా నదీ జలాలపై అవగాహనా రాహిత్యం
- సిఎం సహా మంత్రులకు జీరో నాలెడ్జ్
- ఉత్తమ్ కుమార్ రెడ్డికి అసలు విషయమే తెలియదు
- నల్లగొండ పర్యటనలో కెటిఆర్ విమర్శలు

2 లో



# కెసిఆర్ ధోరణి మార్చుకో

ఏఎం న్యూస్, ఖమ్మం,డిసెంబర్23:

తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. శాసనసభకు వచ్చే ధైర్యం లేని వారు, బయట ఉండి అడ్డగోలుగా మాట్లాడటం తగదని ఆయన హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి నేతలు విషం కక్కుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయట్లేదని వివరించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ఏడా రూ.12,500 కోట్లు విద్యుత్‌శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. తోలు తీస్తామని బీఆర్ఎస్ నేతల మాదిరిగా దిగజారి మాట్లాడలేమన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేసిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రెండేళ్లుగా అసెంబ్లీకి రాని కేసీఆర్.. మీడియా సమావేశంలో ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. శాసనసభకు రావడానికి కేసీఆర్ భయపడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గొప్ప తీర్పు అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని 85 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ భారీ ఆధిక్యతతో ఉంది. గతంలో ఏ రాజకీయ పార్టీని కూడా ప్రజలు ఇంత పెద్ద ఎత్తున దీవించలేదు. ఇందిరమ్మ రాజ్యం ప్రజల పక్షాన నిలబడటం వల్లే ప్రజలు స్వచ్ఛందంగా మాకు మద్దతు ఇస్తున్నారు అని ఆయన



వివరించారు. ముఖ్యంగా 65 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన 'తోలు వలుస్తాం' అనే వ్యాఖ్యలను భట్టి తీవ్రంగా ఖండించారు. తోలు తీసుకునే ఉద్యోగం నువ్వు ఎప్పుడు తీసుకున్నావు కేసీఆర్? పదిమందిని కూర్చోబెట్టుకొని తోలు వలుస్తానంటే ఇక్కడ ఎవరూ భయపడే వారు లేరు. నువ్వు అడ్డగోలుగా మాట్లాడినా, మేము మాత్రం దిగజారి ప్రవర్తించము. మా అభివృద్ధి చాటల ద్వారానే మీకు సమాధానం చెబుతాం' అని భట్టి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభకు వచ్చి ప్రజల సమస్యలపై మాట్లాడాల్సిన బాధ్యతను కేసీఆర్ విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. సభకు వచ్చే ధైర్యం లేకనే బయట ఉండి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. గతంలో జరిగిన ఎన్నికలకు, ఇప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలకు చాలా తేడా ఉందని భట్టి విక్రమార్క అన్నారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా, పూర్తి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించామని, అందుకు ప్రజలు ఓటు ద్వారా కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన మద్దతు ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలను ప్రజలు ఇచ్చారని, ఇప్పటికైనా కేసీఆర్ తన ధోరణి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి, విమర్శలకే పరిమితం కావడం ప్రతిపక్షాలకు తగదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు

# ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

## వరదలు,పారిశ్రామిక ప్రమాదాల నివారణపై దృష్టి సమన్వయంతో ముందుకు సాగిని వివిధ శాఖలు

హైదరాబాద్,డిసెంబర్23:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సహకారంతో, వరదలు,పారిశ్రామిక ప్రమాదాల ప్రతిస్పందన అంశాలపై 22 డిసెంబర్ న తొలిసారిగా రాష్ట్ర స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించింది. ఇటీవలి సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రంలో అనూహ్యమైన ,వివరణలేని వాతావరణ మార్పులు చోటుచేసుకుంటూ, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అకస్మాత్తుగా భారీ వర్షాలు ,ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. అదేవిధంగా, ఇటీవల కాలంలో రాష్ట్రం కొన్ని ప్రధాన పారిశ్రామిక ప్రమాదాలకు కూడా సాక్ష్యంగా నిలిచింది. వరదలకు గురయ్యే ప్రాంతాల ఆధారంగా ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌ను 12 జిల్లాల్లో ఖమ్మం, వరంగల్, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి మరియు హనుమకొండలో నిర్వహించారు. ప్రధాన పారిశ్రామిక ప్రాంతాల ఆధారంగా ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌ను 5 జిల్లాల్లో సంగారెడ్డి, మెడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండ

అలాగే హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్వహించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌ల ప్రధాన లక్ష్యాలు రాష్ట్రం, జిల్లాలు మరియు వివిధ శాఖల సన్నద్ధతను పరీక్షించి మరింత బలోపేతం చేయడం, ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్స్‌ను కార్యరూపంలోకి తేవడం, శాఖల మధ్య సమన్వయం మరియు అత్యవసర మద్దతు విధుల ప్రభావాన్ని అంచనా వేయడం, అలాగే జిల్లా కలెక్టర్లు మరియు ఇతర ఏజెన్సీల



పాత్రలపై స్పష్టత కల్పించడం జరిగింది. మాక్ ఎక్సర్‌సైజ్‌లు వరద ప్రమాద హెచ్చరిక సంకేతాలు అత్యవసర విధానాలపై మెరుగైన అవగాహనను కల్పించాయి. ముందస్తు హెచ్చరిక,సమాచార వ్యవస్థల ప్రభావాన్ని పరీక్షించి లోపాలను గుర్తించారు. శాఖలు,స్పందన బృందాల పాత్రలు, బాధ్యతలు మరింత స్పష్టంగా అవగాహనకు వచ్చి సమన్వయం మెరుగుపడింది. సకాలంలో ప్రజలను తరలించడం, సురక్షిత తరలింపు మార్గాలు మరియు ఆశ్రయాలను గుర్తించడం ఎంత ముఖ్యమో ఈ వ్యాయామాలు హైలైట్ చేశాయి. అత్యవసర స్పందన బృందాలు, పరికరాలు, రక్షణ వనరుల సన్నద్ధతను అంచనా వేశారు. శాఖల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని, వరదల సమయంలో ప్రజల అవగాహన మరియు సహకారం ఎంత ముఖ్యమో స్పష్టం అయింది. మానవ వనరులు, పరికరాలు మరియు లాజిస్టిక్స్‌లో ఉన్న లోపాలను గుర్తించి, మెరుగుదల ప్రణాళికలకు దోహదపడింది. సన్నద్ధత కొనసాగించడానికి క్రమం తప్పని శిక్షణలు మరియు మాక్ డ్రిల్లుల అవసరాన్ని పునరుద్ఘాటించింది. వాస్తవ వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్పందన బృందాలు మరియు సంబంధిత వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పారిశ్రామిక ప్రమాదాల మాక్ ఎక్సర్‌సైజ్‌ల నుంచి కూడా అనేక పాఠాలు నేర్చుకున్నారు. ముఖ్యంగా అగ్నిప్రమాదాలు మరియు రసాయన ఘటనల సమయంలో సమీప పరిశ్రమల మధ్య పరస్పర సహాయం అవసరం, మానవ వనరులు, పరికరాలు మరియు నైపుణ్యాలను పంచుకోవడం ద్వారా స్పందన సమయాన్ని, నష్టాలను తగ్గించవచ్చని గుర్తించారు. అగ్నిమాపక శాఖ, పోలీస్ మరియు వైద్య సేవల వంటి బాహ్య ఏజెన్సీలతో మెరుగైన సమన్వయం అవసరమని హైలైట్ చేశారు. శిక్షణ, మానవ వనరులు మరియు అత్యవసర వనరుల్లో ఉన్న లోపాలను గుర్తించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌లు తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర మరియు పౌర రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మన్ పర్యవేక్షణలో, లీడ్ కన్‌స్టలెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహల్ మార్గదర్శకత్వంలో, వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లు, అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు, వాలంటీర్లు ,ఇతర ఏజెన్సీలు పాల్గొన్నాయి.

# దమ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించండి

ఏఎం న్యూస్, నల్లగొండ,డిసెంబర్23:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన '420' హామీలను అమలు చేయలేక, ప్రజలకు ముఖం చూపించలేక సహకార ఎన్నికల నిర్వహణ నుంచి తప్పించుకుంటోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సర్కారు నామినేటెడ్ పద్ధతిలో 'సహకార' పదవులు నింపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు ఓటేసే అవకాశం ఇస్తే కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయయని అన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను కూడా ప్రభుత్వం భయంతోనే వాయిదా వేస్తోందని విమర్శించారు.నల్లగొండ జిల్లాలో సర్పంచులు, వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కార్యకర్తలకు దిశానిర్దేశంచేస్తూ.. అర్జునుడు చిలుక కన్నును లక్ష్యంగా చేసుకున్నట్టు.. మన దృష్టి కూడా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపైనే ఉండాలని కేటీఆర్ సూచించారు. ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడేది లేదని, నల్లగొండ, మహబూబ్‌నగర్ రైతాంగానికి న్యాయం జరిగే వరకు మన పోరాటం ఆగవద్దని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా మంత్రులకు సాగునీటిపై కనీస అవగాహన లేదని, అబద్దాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా ప్రభుత్వానికి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లాలో జరిగిన సర్పంచులు, వార్డ్ మెంబర్ల అభినందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తిచేస్తే.. మిగిలిన 10 శాతం పనులను కూడా ఈ ప్రభుత్వం పూర్తిచేయలేదని విమర్శించారు.

కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ గర్జిస్తున్నారని, ఆయన గర్జనకు సమాధానం చెప్పలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికి కేసుల పేరుతో నిరాధారమైన లీకులు ఇస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నిజంగానే మేలుచేసి ఉంటే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేదని, కానీ ఓటమి భయంతో ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని విమర్శించారు. నామినేటెడ్ పద్ధతిపై ఆయన ధ్వజమెత్తారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను చూసి భయంతో ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లడంలేదని, నామినేటెడ్ పద్ధతిలో పదవులను భర్తీ చేస్తూ కాలక్షేపం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలు పెడితే రైతులు తగిన బుద్ధి చెబుతారనే భయం ముఖ్యమంత్రిలో ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయదారులు, కూలీలు ప్రభుత్వంపై తీవ్ర కోపంతో ఉన్నారని, ఆ ప్రభావం ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. రైతుబంధు, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రైతు కూలీలకు నెలకు వెయ్యి రూపాయల భరోసా వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే



కేసీఆర్‌పై నిరాధారమైన కేసుల లీకులు ఇస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే.. రైతులకు మంచి చేశామన్న నమ్మకం ఉంటే.. సహకార ఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు. ఎన్నికల నుంచి కాంగ్రెస్ ఎన్ని రోజులు తప్పించుకున్నా, ప్రజాక్షేత్రంలో ఆ పార్టీని నిలదీయడం ఖాయమని కేటీఆర్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపట్ల చిత్తశుద్ధితో ఉంటే వెంటనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ కేవలం కాలక్షేప రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే, కేసుల గురించి వెనుక నుండి లీకులు ఇవ్వడం మానేసి, నేరుగా కెమెరా ముందుకు రావాలని, ఏ కేసు పెడుతున్నారో చెప్పాలని సవాల్ విసిరారు. హోంమంత్రి కూడా ఆయనే కాబట్టి ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని, శిఖండి రాజకీయాలు చేయడం తగదని విమర్శించారు. ప్రజా ప్రయోజనాలకంటే కేవలం కేసుల చుట్టూనే ప్రభుత్వాన్ని తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, భూపాల్ రెడ్డి, రవీంద్ర కుమార్ నాయక్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, నాయకులు చెరుకు సుధాకర్, ఒంటెద్దు నరసింహారెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల అజ్ఞానంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నల్లగొండ జిల్లా వేదికగా సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి నదీ జలాల అంశంపై ఎలాంటి అవగాహన లేదని విమర్శించారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులపై కేటీఆర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీళ్లపై కనీస అవగాహన లేదని విమర్శించారు. ఇటీవల జరిగిన ఒక మీడియా సమావేశంలో నీళ్ల గురించి అడిగిన ప్రశ్నలకు 'నేను ప్రిపేరయ్యి రాలేదు, రేపు వచ్చి సమాధానం చెప్తా' అని తప్పించుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. మరో మంత్రి గురించి చెబుతూ 'వాటర్‌లో నీళ్లు' అని మాట్లాడే అజ్ఞాని అంటూ ఎద్దేవా చేశారు. ప్రజల కష్టాలు, సాగునీటి అవసరాలు తెలియని వాళ్లు అడ్డదారిలో అధికారంలోకి వచ్చి హూంకరిస్తున్నారని, అబద్దాలు చెప్పి గందరగోళం సృష్టించడం తప్ప వారికి ప్రజలపట్ల చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం కేసీఆర్ గర్జిస్తుంటే, దానికి సమాధానం చెప్పే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి కీలక ప్రాజెక్టులను ఈ ప్రభుత్వం అశ్రద్ధ చేస్తోందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి గత ప్రభుత్వం 90 శాతం పనులు పూర్తి చేస్తే.. మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తిచేయలేక ఈ రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. డీపీఆర్ (ఆఖఫీ) పంపడంలో విఫలమవడమే కాకుండా, ప్రాజెక్టుల పరిధిని కుదిస్తూ తెలంగాణ ప్రయోజనాలకు గండికొడుతున్నారని విమర్శించారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతాంగానికి కృష్ణా జలాల్లో న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. సాగునీటి అంశంపై కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం తడబడుతోందని, ప్రజల దృష్టిని మళ్లించడానికి బెదిరింపులకు దిగుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.



# తెలంగాణకు స్పష్టమైన విజన్ తెలంగాణ రైజింగ్..

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆయా శాఖల్లో పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. శాఖల మధ్య సమన్వయంపై కీలక సూచనలు చేశారు. ప్రతీ సెక్రటరీ వారి వారి శాఖల్లో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా సీఎస్‌కు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల హోచ్‌వోడీలు వెరిఫై చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. '

# మాజీ ప్రధాని పివికి సిఎం రేవంత్ నివాళి

ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్23:

భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆర్థిక సంస్కరణల దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని సిఎం అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని స్థిరత్వం వైపు నడిపిన అపూర్వ మేధావి, బహుభాషా పండితుడిగా, పరిపాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. తెలంగాణ బిడ్డగా దేశ ప్రధానిగా ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశానికి గౌరవం పెంచిన మహనీయుడని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.

# సర్పంచ్‌లకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

## పంచాయితీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష

ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్23:

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటింది. ఈ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు.. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంచి పాలన అందించి, పంచాయతీలను ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతారని.. మీరంతా ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వారందరికీ సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో.. నవంబర్ 11, 14, 17 తేదీల్లో జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని అగ్రస్థానంలో నిలిచింది. మూడు దశల్లో మొత్తం 6821 స్థానాల్లో గెలుపొందింది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ 3520 స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ 703 స్థానాల్లో గెలిచింది. ఇతరులు 1654 స్థానాలను గెలుచుకున్నారు.

# 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా యూరియా యాప్

ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్23:

వ్యవసాయశాఖ ద్వారా ప్రవేశపెట్టిన యూరియా యాప్ 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా గత రెండ్రోజుల నుండి పరిశీలించడం జరిగిందని, 5 జిల్లాలలో దాదాపు లక్ష మందికి పైగా డౌన్ లోడ్ చేసుకోవడం జరిగిందని మంత్రి తుమ్మలనాగేశ్వర రావు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 897, జనగామ జిల్లాలో 5150, మహబూబ్ నగర్ 3741, నల్లగొండ 3618 మరియు పెద్దపల్లి జిల్లాలోని 6289 మొత్తం 19695 మంది రైతులు ఈ యాప్ ద్వారా యూరియాను తమ సమీప డీలర్ దగ్గర 60,510 యూరియా బస్తాలు బుక్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా 217 మంది కౌలు రైతులు కూడా 678 యూరియా బస్తాలు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకోవడం జరిగిందని, మొదటి రోజు అక్కడక్కడ తలెత్తిన సాంకేతిక సమస్యలను కూడా వెంటనే పరిష్కరించడం జరిగిందని తెలిపారు. రైతులు కూడా ఈ యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని, వారికి వారి ఊరిలో ఏ డీలర్ దగ్గర ఎంత స్టాక్ ఉందో తెలుస్తుందని, తద్వారా వారు బుక్ చేసుకొని, వారికి నచ్చిన సమయంలో షాప్ వద్దకు వెళ్లి ఒటిపి చూపించి కొనుగోలు చేసారని తెలిపారు. ఈ రెండు రోజుల్లో యాప్ విజయవంతం కావడంతో, ఈ యాప్ ను మరికొన్ని రోజులు పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధం కావాల్సిందిగా అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. ఈ రోజు రైతునేస్తం కార్యక్రమంలో కూడా రైతులకు యాప్ పై గల సందేహాలను నివృత్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ రబీ సీజన్ కు గాను రాష్ట్రానికి ఇప్పటికే 5.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావడం జరిగిందని, యూరియా వినియోగం అధికంగా ఉండే జనవరి, ఫిబ్రవరి నెలలకు గాను సరిపడ యూరియాను ముందస్తుగానే తెప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

# అక్రమ వసలదారులకు ట్రంప్ గాలం

ఏఎం న్యూస్, వాషింగ్టన్,డిసెంబర్23:

అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వారికి గతంలో ప్రకటించిన ఓ ఆఫర్‌ను భారీగా పెంచింది. అమెరికా వీడేందుకు అంగీకరించిన వారికి ఇస్తామన్న స్టైఫండ్‌ను మూడు వేల డాలర్లకు పెంచినట్లు పేర్కొంది. స్వదేశానికి వెళ్లిపోయేందుకు ఉచితంగా విమాన ప్రయాణ సదుపాయానికి ఇది అదనమని తెలిపింది. ఈ హాలీడే ఆఫర్ ఈ ఏడాది చివరి వరకు మాత్రమేనని సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేసింది.డీహెచ్ఎస్ ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి 19లక్షల మంది అక్రమ వలసదారులు స్వచ్ఛందంగా దేశాన్ని వీడిపోయారని సమాచారం. వీరిలో కొన్ని వేల మంది సీబీపీ హోమ్ యాప్‌ను వినియోగించు కున్నట్లు తెలిసింది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తొలి ఆరు నెలల్లోనే 1.5లక్షల మందిని బహిష్కరించగా.. దాదాపు 13వేల మంది స్వచ్ఛందంగా వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే, ఈ గణాంకాలకు సంబంధించి అధికారిక సమాచారం వెలువడలేదు. అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపిస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వందలాది మందిని అరెస్టు చేస్తోంది. అనంతరం వారిని నిర్బంధ కేంద్రాలకు తరలిస్తోంది. ఈ క్రమంలో స్వచ్ఛందంగా అమెరికా వీడాలనుకునే వారికి ప్రోత్సాహకంగా వెయ్యి డాలర్లు ఇస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ ఈ ఏడాది మేలో ప్రకటించింది. ఇందుకోసం కస్టమ్స్ అండ్ బార్డర్ ప్రొటెక్షన్ హోమ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించింది. అటువంటి వారిని నిర్బంధించాల్సిన అవసరం లేకుండా చూస్తామని, బలవంతంగా స్వదేశానికి తరలించాల్సిన జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొంది. అంతేకాదువారిపై విధించిన జరిమానాలపైనా మినహాయింపు ఇస్తామని చెప్పింది. ప్రభుత్వం అందిస్తోన్న ఈ ప్రత్యేక ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోని అక్రమ వలసదారులకు అరెస్టు, బహిష్కరణ మాత్రమే మార్గమని డీహెచ్ఎస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు అటువంటి వారికి అమెరికాకు మళ్లీ తిరిగి వచ్చే అవకాశమే ఉండదని స్పష్టం చేస్తున్నారు.

# బంగారం వెండి ధరలు మరంత దూకుడు

## భారీగా పెరిగిన ధరలు

హైదరాబాద్,డిసెంబర్23:

పసిడి ధరల పరుగు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతోంది. రోజురోజుకూ పెరగడమే తప్ప తగ్గడం జరగడం లేదు. దేశీయంగా సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి ధర ఒక్కరోజులోనే రూ.2,650 మేర పెరిగి రూ.1,40,850కు చేరింది. సోమవారం 99.9 స్వచ్ఛత కలిగిన పసిడి రూ.1,38,200గా ఉంది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం సాయంత్రానికి 10 గ్రాముల ధర రూ.1,40,820 పలుకుతోంది. ఈ ఒక్క ఏడాదిలోనే బంగారం రూ.61,900 పెరిగింది. 2024 డిసెంబర్ 31న 10 గ్రాముల పసిడి రూ.78,950గా ఉండగా.. నేడు 78 శాతం పెరిగి రూ.1.50 లక్షల దిశగా దూసుకెళ్తోంది.మరోవైపు వెండి కూడా సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. దిల్లీలో కిలో వెండి ధర ఒక్కరోజులోనే రూ.2,750 పెరిగి రూ.2,17,250కి చేరింది. ఈ ఒక్క క్యాలెండర్ సంవత్సరంలో వెండి దాదాపు రూ.1,27,550 పెరిగింది. గతేడాది డిసెంబర్ 31 నాటికి కిలో వెండి ధర రూ.89,700గా ఉంది. అంటే దాదాపు 142.2 శాతం వృద్ధి నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సు 4,500 డాలర్లకు సమీపించడంతో దేశీయంగా అదే స్థాయిలో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. మరోవైపు వెండి సైతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు తొలిసారి 70 డాలర్ల మార్కు దాటింది.

# టాలీవుడ్ ప్రో లీగ్‌కు శ్రీకారం చుట్టిన ఈబీజీ గ్రూప్

- లీగ్‌ను ప్రారంభించిన ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు
- టిపిఎల్ ప్రారంభోత్సవానికి హాజరైన క్రికెట్ లెజెండ్స్ కపిల్ దేవ్, సెహ్వాగ్, సురేష్ రైనా

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :
తెలుగు సినిమా పరిశ్రమ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్రీమియం క్రికెట్-ఎంటర్‌టైన్‌మెంట్ లీగ్ టాలీవుడ్ ప్రో లీగ్ ( టి పి ఎల్)ను ఈబీజీ గ్రూప్ సోమవారం అధికారికంగా ప్రారంభించింది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసిసి) లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు లీగ్‌ను ప్రారంభించగా, ఆయనే టాలీవుడ్ ప్రో లీగ్‌కు గౌరవాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సినిమా-క్రీడలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ ప్రారంభోత్సవానికి భారత క్రికెట్ దిగ్గజాలు కపిల్ దేవ్, విరేందర్ సెహ్వాగ్, సురేష్ రైనా ముఖ్య అతిథులుగా హాజరై లీగ్‌కు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులు డినో మోరియా, ఆశిష్ విద్యార్థి, మురళీ శర్మ తదితరులు హాజరయ్యారు. ఆరు జట్లతో ఫ్రాంచైజీ విధానంలో నిర్వహించనున్న టాలీవుడ్ ప్రో లీగ్‌ను సంవత్సరానికి రెండు సీజన్లుగా నిర్వహించనున్నారు. సెలబ్రిటీలే ఆటగాళ్లుగా, ప్రముఖ నిర్మాతలు జట్టు యజమానులుగా వ్యవహరించే ఈ లీగ్‌లో పోటీ క్రికెట్‌తో పాటు ఫ్యాన్ జోన్లు, సంగీత కార్యక్రమాలు,



సామాజిక భాగస్వామ్యం, నాణ్యమైన డిజిటల్ కంటెంట్‌ను అందించనున్నారు. లీగ్ ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని తెలుగు సినిమా పరిశ్రమ సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఈబీజీ గ్రూప్ వ్యవస్థాపకుడు మరియు చైర్మన్ డా. ఇర్ఫాన్ ఖాన్ టాలీవుడ్ ప్రో లీగ్ కేవలం క్రికెట్ టోర్నీ మాత్రమే కాదని వ్యవస్థ బద్ధత కోసం దీర్ఘకాల దృష్టితో రూపుదిద్దుకున్న సాంస్కృతిక ఉద్యమం. తెలుగు సినిమా పరిశ్రమలో ఐక్యతను పెంపొందిస్తూ అభిమానులకు ప్రపంచ స్థాయి వినోద అనుభూతిని అందించడమే మా లక్ష్యం. లీగ్‌లో భాగంగా చేపట్టిన అలై బలై కార్యక్రమం సినిమా రంగంలోని ప్రతి కళాకారుడికి ప్రాతినిధ్యం కల్పిస్తుంది అని తెలిపారు. టాలీవుడ్ ప్రో లీగ్ గౌరవాధ్యక్షుడు దిల్ రాజు మాట్లాడుతూ, "సినిమా పరిశ్రమను ఒకే వేదికపైకి తీసుకువచ్చే గొప్ప ప్రయత్నమే టీపీఎల్. సినిమా నిర్మాణంలో భాగమైన ప్రతి ఒక్కరినీ గౌరవిస్తూ పరిశ్రమలో ఐక్యతను పెంపొందించే ఈ లీగ్‌లో భాగమవడం నాకు గర్వకారణం అని అన్నారు. వృత్తిపరమైన పాలన, సమగ్రత, సమావేశత అనే మూల సూత్రాలతో రూపొందిన టాలీవుడ్ ప్రో లీగ్ సినిమా-క్రికెట్ సమ్మేళనంగా దేశంలోని స్పోర్ట్స్-ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పే దిశగా అడుగులు వేస్తోంది.




## రాష్ట్రపతి చేతుల మీదుగా ఇయర్‌రింగ్ మిషన్ అందుకున్న వనమాల వైష్ణవి

ఏ ఎం న్యూస్ ఓయూ:

హైదరాబాద్ శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు విచ్చేసిన భారత రాష్ట్రపతి ద్రౌపది మురుము చేతుల మీదుగా వన మాల వైష్ణవి చెవికి ఇయర్‌రింగ్ మిషన్ తొడిగించుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సౌజన్యంతో ఈ ఇయర్‌రింగ్ మిషన్ అందజేయబడింది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గ ఓబీసీ జాయింట్ కన్వీనర్ వనమాల శ్రీనివాస్ కూడా కార్యక్రమంలో పాల్గొని ఈ ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ కార్యక్రమం వనమాల వైష్ణవి కుటుంబానికి ప్రత్యేకమైన అనుభూతిని కలిగించింది. దేశ అత్యున్నత పదవిలో ఉన్న రాష్ట్రపతిని ప్రత్యక్షంగా చూడడమే కాకుండా, ఆమె చేతుల మీదుగా ఇయర్‌రింగ్ మిషన్ అందుకోవడం తన జీవితంలో మరచిపోలేని క్షణమని వైష్ణవి ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని వైష్ణవిని అభినందించారు. రాష్ట్రపతి సాన్నిధ్యం ఈ కార్యక్రమానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చిందని వారు తెలిపారు.

## మహేష్ స్వామి నివాసంలో అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ

ఏ ఎం న్యూస్ ఓయూ:


నార్త్ లాలాగూడ లోని మహేష్ స్వామి నివాసంలో అయ్యప్ప స్వామి పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. రమేష్ గుప్త గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పకు అభిషేకం, అయ్యప్ప పడిపూజలో వారి బృందం పాల్గొని స్వామి కీర్తనలు పాడుతూ భజనలు చేస్తూ తన్మయత్వం పొందారు. పూజలో మహేష్ స్వామి కుటుంబ సభ్యులు మమత, రుత్విక్ యశ్వంత్, రమేష్ గుప్తా గురుస్వామి బృందం స్వాములు ఎల్.ఎల్.బి శ్రీను, రైల్వే శ్రీనివాస్, సాయి, స్వరాజ్, చరణ్ గౌడ్, బాబా అశోక్,శ్రీను మామ, సింగం రవి, బుల్లెట్ భాస్కర్, మల్లికార్జున్, వీరప్ప, మదన్ చారి, మహేష్, గోపి, తరుణ్, లలిత్ తో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జోష్ క్రీడల్లో సత్తా చాటిన రఘునాథపాలెం మైనార్టీ పాఠశాల బాలికలు

ఏఎం న్యూస్ / హైదరాబాద్ :


ఇంటర్ స్కూల్ జోష్ ఛాంపియన్ ...ఈ నెల 19నుండి 20 వరకు కారేపల్లి లో జరిగిన మైనారిటీ పాఠశాలల బాలికల ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్లో తమ విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి జోష్-3 ఛాంపియన్షిప్ గెలుచుకోవడం చాలా ఆనందంగా ఉందని మైనారిటీ ఖమ్మం గర్ల్స్ వన్ ప్రిన్సిపల్ శైలజ అన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి అనేక పాఠశాలలు ఈ టోర్నమెంట్ లో పాల్గొన్నాయన్నారు. పోటీలు చాలా ఉత్తేజకరంగా జరిగాయని ఖమ్మం గర్ల్స్-1 జట్టు 8 విభాగాల్లోఅసాధారణమైన ప్రదర్శన కనబరిచి ఛాంపియన్ ట్రోఫీ గెలుచుకుందన్నారు. ప్రతి మ్యాచ్ లోను బాలికలు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ప్రేక్షకులను ఆకట్టుకున్నారన్నారు. Josh-3 ఛాంపియన్షిప్ వరుసగా మూడుసార్లు తమ పాఠశాలనే గెలుచుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో పాఠశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది క్రీడాకారులను మరియు పాఠశాల పిఈటి ప్రేమరాణి ని అభినందించారు.



## కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సెల్‌గా హైకోర్టు న్యాయవాది భాస్కర్ గిరి నియామకం

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :

సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది, సామాజిక సేవకుడు ఏ.ఎస్. భాస్కర్ గిరి తెలంగాణ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నియామకం మూడు సంవత్సరాల కాలపరిమితి కోసం ఉంటుందని న్యాయశాఖ వెల్లడించింది. హైకోర్టు న్యాయవాదిగా వృత్తిని కొనసాగిస్తున్న భాస్కర్ గిరి, న్యాయవృత్తితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, ఫ్యామిలీ కౌన్సెలింగ్, ఉచిత న్యాయసలహాలు, చట్టాల పట్ల అవగాహన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. భాస్కర్ గిరి సేవల పట్ల కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖ సంతృప్తి వ్యక్తం చేసింది. తన నియామకంపై స్పందించిన భాస్కర్ గిరి కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సెల్‌గా తన బాధ్యతలు మరింత పెరిగాయి అన్నారు. తనకు అవకాశం కల్పించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా పూర్తిస్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులైన భాస్కర్ గిరికి సికింద్రాబాద్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు అభినందనలు తెలిపారు. ఆయన నియామకంపై హర్షం వ్యక్తం చేశారు.

## రాజకీయ లబ్ది కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కేసీఆర్

- టీడీపీ నేత వల్లారపు శ్రీనివాస్ కుమార్

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :

రాజకీయ లబ్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ చిచ్చు పెడుతున్నారని టిడిపి సీనియర్ నాయకుడు సికింద్రాబాద్ ఇన్చార్జ్ వల్లారపు శ్రీనివాస్ విమర్శించారు. గోదావరి నదీ జలాల అంశంలోను, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై కూడా తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి లికే. చంద్రశేఖర్ రావు (కేసీఆర్)లిపై విమర్శలు చేశారు. రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్ ప్రజలను గందరగోళానికి గురి చేస్తూ తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నాయుడిని అన్యాయంగా అరెస్ట్ చేశారని, ఆయన నిజాయితీకి నిదర్శనంగా ఐటీ ఉద్యోగులు సహా ప్రజలు పెద్ద ఎత్తున మద్దతుగా నిలిచారని శ్రీనివాస్ కుమార్ తెలిపారు. తన పది సంవత్సరాల పాలనలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడంలో కేసీఆర్ విఫలమయ్యారని అధికారాన్ని కోల్పోయిన తర్వాత ఇప్పుడు అబద్ధపు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మాటలను ప్రజలు ఇక నమ్మరని ఈ విధమైన తప్పుదారి పట్టించే రాజకీయాలను తిరస్కరిస్తారని టీడీపీ నేత స్పష్టం చేశారు. ఇటీవల గ్రామ సర్పంచ్ల ఎన్నికల్లో టిడిపి బలం పుంజుకోడాన్ని కెసిఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల కెసిఆర్ అవినీతి పాలనలో విసుగు చెందిన ప్రజలు ప్రతిపక్షానికే పరిమితం చేశారని దుయ్యబట్టారు.

## ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా మాయబ్రహ్మ నరసింహ నియామకం

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :

వికారాబాద్ జిల్లా కోర్టు II తరగతి ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్గా మాయబ్రహ్మ నరసింహ నియ మితులయ్యారు ఈ మేరకు నియామక ఉత్తర్వులు జిల్లా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్-కమ్-సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటేశ్వర్లు జారీ చేశారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బి ఎన్ ఎస్ ఎస్) చట్టం 2023లోని సెక్షన్ 11 ప్రకారం ఈ నియామకం జరిగింది. మాయబ్రహ్మ నరసింహ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుండి ఒక సంవత్సరం పాటు లేదా 65 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు విధులు నిర్వహించనున్నారు. సికింద్రాబాద్ వాస్తవ్యుడైన మాయ బ్రాహ్మ నరసింహ ఎంతోకాలంగా న్యాయవాదిగా తన వృత్తిని కొనసాగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తూ నిస్వార్థంగా ప్రజలకు న్యాయ పరమైన సలహాలను అందజేస్తున్నారు. తనను న్యాయమూర్తిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తన వృత్తి ధర్మాన్ని తూచా తప్పక పాటిస్తానని ప్రజలకు సత్వర న్యాయం అందే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కాగా ఆయన వికారాబాద్ జిల్లా కోర్టులో సోమవారం న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

## ప్రజాస్వామ్య విలువలని కూనీ చేస్తున్న బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు కౌశిక్ హరి

- పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ యువజన ఉపాధ్యక్షుడు ఇరికి మహేష్

ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్23:

గోదావరిఖని చౌరస్తాలో కూల్చివేతకి సంబంధించి విషయంపై కౌశిక హరి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఓట్ల ద్వారా ఎన్నికైన గౌరవ శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ అన్న గారి పై పరుష పదజాలం, అన్ పార్లమెంటరీ పదాలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ప్రజలు హర్షించారని, ప్రజల్లో భంగపాటు తప్పదని ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ పక్షాన హితో పలుకుతున్నాం. రామగుండం నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల్లో జరుగుతున్న అభివృద్ధికి నిదర్శనం నియోజకవర్గంలో 24 గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ రాజ్ ఠాగూర్ బలపరిచిన అభ్యర్థులు గెలవడం మా ఎమ్మెల్యే పని తీరుకుని దర్శనం. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి నాలుగు గ్రామపంచాయతీలు గెలవడం వారి పని నిదర్శనం అని ఇప్పటికైనా వారిలో మార్పు రావాలని అలాగే భారత జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఒక్కరు గెలవలేరు జీరోకి పరిమితం చేశారు నియోజకవర్గ ప్రజలు.

## సమస్యలు తెలుసుకున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేతో మనోజ్ కుమార్ యాదవ్

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :


తెలంగాణ రాష్ట్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగల్‌రావు నగర్ డివిజన్‌లో సోమవారం పలు అభివృద్ధి(62 లక్షల అభివృద్ధి పనుల శంకుస్థాపన) పనుల శంకుస్థాపనలో పాల్గొన్నారు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ కు శాలువాతో ఘనంగా సన్మానించారు స్థానికులు.ఈ కార్యక్రమంలో పలు హోదాల కాంగ్రెస్ పార్టీ నాయకుల తో పాటు, మనోజ్ కుమార్ యాదవ్( సికింద్రాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ) పాల్గొన్నారు ఈ కార్యక్రమం తర్వాత వీడియో గల్లీలో ఉన్న స్థానికుల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు వి. నవీన్ యాదవ్. ప్రతి ఒక్కరూ చెప్పిన సమస్యను ఓపిగ్గా విని స్థానికులకు సమాధానాలు ఇస్తూ, సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిహెచ్ఎంసి అధికారుల ను కోరారు ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్. ఈ కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు సత్యం యాదవ్,అనిల్, ఆజం, సాభే ర్, శేఖర్ యాదవ్, మహేష్ యాదవ్, హైమద్, జగజోత్ పాల్గొన్నారు.

## నవీన్ పటేల్‌కు శుభాకాంక్షలు తెలిపిన మాగంటి సునీత గోపీనాథ్..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ నియోజకవర్గం యూసఫ్ కూడా డివిజన్ శ్రీకృష్ణ నగర్ స్థానికుడు, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్ పటేల్ ఎల్.ఎల్.బి పూర్తి చేసి అడ్వకేట్ గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మాగంటి సునీత గోపీనాథ్ ని యూసఫ్ కూడా డివిజన్ గణపతి కాంప్లెక్స్ లోని వారి క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా సునీత గోపీనాథ్ మాట్లాడుతూ న్యాయవాదులు కేవలం కోర్టులో వాదించేవారు మాత్రమే కాదు, వారు సమాజంలో న్యాయం, సమానత్వం, సరైన చట్ట పరిపాలనను నిర్ధారించే ముఖ్యమైన మూల స్తంభాలు అని అన్నారు. సునీత గోపీనాథ్ అడ్వకేట్ గా ప్రమాణ స్వీకారం చేసిన నవీన్ పోగులకు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆక్సిజన్ రాకపోవడంతో ఇద్దరు మృతి

- దర్యాప్తు చేస్తున్న కొల్లూర్ పోలీసులు..

ఎ ఎం న్యూస్ పటాన్చెరు:


సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు పోలీస్ స్టేషన్ కి వచ్చి అమిత్ రుయిడాస్ (వయస్సు 27 సం. వృత్తి ఎస్ టి పి ఆపరేటర్,) మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం తమ్ముడు సోమిత్ రుయిడాస్ (వయస్సు 22 సం.) గత ఒక సంవత్సరం నుంచి ఆర్ ఆర్ ఇంజినీరింగ్ కంపెనీలో ఎస్ టీ పి ఆపరేటర్‌గా పనిచేస్తూ, ప్రస్తుతం కొల్లూరు లోని బ్లాసమ్ హైట్స్ అపార్ట్‌మెంట్స్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అతనితో పాటు హరిష్ సింగ్ అనే మరో ఎస్ టీ పి ఆపరేటర్ కూడా అక్కడ పనిచేస్తున్నాడు. 22-12-2025 అర్ధరాత్రి సుమారు 11:30 గంటలకు ఎస్ టీ పి ట్యాంక్‌లోని నీటిని తొలగించిన అనంతరం అర్ధరాత్రి సుమారు 12:30( తెల్లవారుతే మంగళవారం) గంటలకు సోమిత్ రుయిడాస్, హరిష్ సింగ్ ట్యాంక్ శుభ్రపరిచేందుకు లోపలికి వెళ్లారు. వారికి ఆక్సిజన్ రాకపోవడం తో సోమిత్ రుయిడాస్, హరిష్ సింగ్ నీళ్ళలోనే మరణించారు అని కొల్లూరు పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## డాక్టర్ కె. శ్రీనివాస్‌కు జాతీయ పరిశోధక అవార్డు

ఏ ఎం న్యూస్ ఓయూ :



సోషియాలజీ విభాగం నుండి రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ శ్రీనివాస్ కథేరసాల ప్రతిష్టాత్మక జాతీయ పరిశోధకుడు అవా ర్డుతో సత్కరించబడ్డారు. ఈ అవార్డును భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ట్రీనేత్ర ఫౌండేషన్ సహకారంతో ప్రదానం చేసింది. "వికసిత్ భారత్ 2047" మరియు "అటల్స్ విజన్: ఇన్క్లూజివ్ అండ్ సస్టైనబుల్ డెవలప్మెంట్" పై ఆయన రాసిన అత్యుత్తమ పరిశోధనా పత్రం మరియు ప్రచురణకు గుర్తింపుగా ఈ అవార్డు ఇవ్వబడింది. ఆయన పరిశోధన భారతదేశ దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను మరియు మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి దార్శనికతను హైలైట్ చేస్తుంది.ఈ అవార్డును అందజేశారు.

## కాంగ్రెస్‌ది పక్కా మాఫియా పాలన

చెక్‌డ్యామ్‌లను కూల్చేస్తున్న ఇసుక మాఫియా
ప్రభుత్వ కనుసన్నల్లోనే ఈ వ్యవహారం
మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,డిసెంబర్23:**
తెలంగాణలో నడుస్తోంది ప్రజా పాలన కాదు.. పక్కా మాఫియా పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నాడు ఎన్నికల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద బాంబులు వేశారని.. నేడు ఇసుక మాఫియా కోసం ఏకంగా చెక్ డ్యామ్‌ల మీద జెలటిన్ స్టిక్స్‌తో బాంబులు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాటర్ మ్యాన్ రాజేంద్ర సింగ్ ఇది మానవ నిర్మిత విధ్వంసం అని మొత్తుకుంటున్నా, ఈ 'చిట్టి నాయుడి' ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని అన్నారు. డ్రిల్లింగ్ మెషీన్లతో హోల్స్ చేసి, జెలటిన్ స్టిక్స్ పెట్టి పేల్చారని ఆయన సాక్ష్యాలతో సహా నిరూపించారని అన్నారు.ఇసుకను దోచుకోవడానికి అడ్డుగా ఉన్నాయని, కోట్ల రూపాయల ప్రజా ధనంతో కట్టిన చెక్ డ్యామ్‌లను డైనమైట్లు పెట్టి పేల్చేస్తారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వమా లేక గ్యాంగ్ స్టర్ల అడ్డాయా అని నిలదీశారు. భూగర్భ జలాలు పెరగాలని మేం చెక్ డ్యామ్‌లు కడితే.. వాటిని కూల్చివేసి రైతుల పొలాలను ఎడారిగా మారుస్తున్నారని మండిపడ్డారు. మీ ఇసుక కాంట్రాక్టర్ల లాభాల కోసం తెలంగాణ రైతాంగం బలి కావాలా అని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కూలిపోయాయని కట్టుకథలు అల్లిన కాంగ్రెస్ మంత్రులకు రాజేంద్ర సింగ్ రిపోర్ట్ చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు మీ సమాధానం ఏంటి రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. అభివృద్ధి చేయడం చేతకాదు కానీ, ఉన్న ఆస్తులను కూల్చడంలో మీరు సిద్ధహస్తులని విమర్శించారు. తెలంగాణ ఆస్తులపై బాంబులు వేస్తున్న మాఫియా వెనుక ఉన్న అసలు దొంగలను బయటపెట్టండని డిమాండ్ చేశారు. రాజేంద్ర సింగ్ డిమాండ్ చేసినట్లు పీపుల్స్ ఎంక్వైరీ కమిషన్ వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే ఈ బాంబుల సెగ మీ కుర్చీ దాకా రావడం ఖాయమని హెచ్చరించారు.

# శివాజీ వ్యాఖ్యల రచ్చ


**దులిపేసిన సింగర్ చిన్మయి**
**మా బాడీ..మా ఇష్టం**
**అన్న అనసూయ**
**శివాజీ తరఫునే నేను**
**క్షమాపణలు చెబుతున్నా: మనోజ్**



నటుడు శివాజీ వ్యాఖ్యలపై సింగర్ చిన్మయి సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. హీరోయిన్లు చీరలు కట్టుకోవాలని, లేదంటే వారి 'సామాన్లు' కనిపిస్తాయని శివాజీ అనడాన్ని చిన్మయి తప్పుబట్టింది. ముఖ్యంగా 'దరిద్రపు ము?' వంటి బూతు పదాలను ప్రొఫెషనల్ వేదికలపై వాడటం ఏంటని శివాజీని ప్రశ్నించింది. సామాన్లు వంటి పదాలను కేవలం 'ఇన్సెల్స్' (స్త్రీ ద్వేషులు) మాత్రమే వాడుతుంటారని ఆమె విమర్శించింది. అంతేగాకుండా హీరోయిన్లు భారతీయ సంప్రదాయం పాటించాలని చెప్పిన శివాజీ.. తాను మాత్రం జీన్స్, హూడీలు ధరిస్తారు. సంప్రదాయం గురించి అంతగా మాట్లాడేటప్పుడు ఆయన కేవలం ధోతీలు మాత్రమే కట్టుకోవాలి కదా? నుదుట బొట్టు పెట్టుకోవాలి, వివాహం అయినట్లు గుర్తుగా కంకణాలు, మెట్టెలు ధరించాలి కదా? అంటూ చిన్మయి ప్రశ్నించింది. ఒక సినిమాలో విలన్‌గా నటించిన శివాజీ.. బయట ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా స్త్రీలను ద్వేషించే వ్యక్తులకు హీరోగా మారుతున్నారని ఆమె ఎద్దేవా చేసింది. ఒక బహిరంగ వేదికపై మహిళల పట్ల ఇలాంటి ప్రవర్తన ఉండటం నమ్మశక్యంగా లేదని, అసలు మహిళలను ఇక్కడ ఎలా చూస్తున్నారో అర్థమవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్మయి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి.



నటుడు శివాజీ వ్యాఖ్యలపై ఇప్పటికే సింగర్ చిన్మయి స్పందించగా.. తాజాగా యాంకర్, నటి అనసూయ కూడా శివాజీకి గట్టి కౌంటర్‌ను ఇచ్చింది. అనసూయ ఎక్స్ వేదికగా పోస్ట్ పెడుతూ.. ఇది మా బాడీ.. మీది కాదు. మాకు నచ్చినట్లు మేం ఉంటాం అంటూ శివాజీకి కౌంటర్ ఇచ్చారు. మహిళలకు తమకు నచ్చిన దుస్తులు వేసుకునే స్వేచ్ఛ ఉందని, వారి వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం తప్పని శివాజీ వ్యాఖ్యలను పలువురు తప్పుపట్టారు. ఈ వ్యాఖ్యలను తప్పుబడుతూ ఇప్పటికే సింగర్ చిన్మయి, అనసూయ శివాజీని విమర్శించగా.. తాజాగా మంచు మనోజ్ కూడా శివాజీ పేరు ఎత్తకుండానే ఆయనకు గట్టి కౌంటర్ ఇచ్చారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మనోజ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఒక లేఖ విడుదల చేశాడు. మహిళల దుస్తుల విషయంలో నీతులు చెప్పడం, వారిపై నైతిక బాధ్యత లేదు అని ఆరోపించడం అనేది చాలా పాత కాలపు ఆలోచన. ఇలాంటి వ్యాఖ్యలు తనను తీవ్ర నిరాశను కలిగించాయని మనోజ్ పేర్కొన్నారు. సమానత్వం, గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ అనేవి చర్చించలేని అంశాలని మహిళల బట్టలపై తీర్పు ఇచ్చే అధికారం ఎవరికీ లేదని ఆయన తేల్చి చెప్పారు. మహిళలను కించపరిచేలా వస్తువులుగా చూస్తూ మాట్లాడిన ఆ సీనియర్ నటుడి తరఫున నేను క్షమాపణలు చెబుతున్నాను. పబ్లిక్ ఫిగర్స్‌గా ఉన్నవారు సమాజంపై తమ మాటల ప్రభావం ఉంటుందని గుర్తించి బాధ్యతగా మాట్లాడాలని ఆయన హితవు పలికారు. హిళలకు ఎప్పుడూ గౌరవం, సమానత్వం దక్కాలి. ఇలాంటి విషయాల్లో మౌనంగా ఉండటం సరైన పద్ధతి కాదు. మనోజ్ కుమార్ తన పోస్ట్‌ను ముగించాడు.



# రవిబాబు మరో ఆసక్తికర సినిమా

**నేడు వివరాలు**
**వెల్లడిస్తామని ప్రకటన**

క్రియేటివ్ డైరెక్టర్ రవిబాబు మరోసారి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచే ప్రకటన చేశారు. ఇటీవల ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏనుగు తొండం ఘటికాచలం' సినిమా థియేటర్లకు కాకుండా నేరుగా ఈటీవీ విన్ ఓటీటీలో విడుదలైన విషయం తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఇప్పుడు రవిబాబు తన కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా అనౌన్స్ చేస్తూ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. తాజాగా ఈ కొత్త సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఆ పోస్టర్ చూడగానే ఇది సాధారణ సినిమాకాదు, పూర్తిగా భిన్నమైన కథతో రూపొందుతున్న సినిమా అనే ఫీలింగ్ కలుగుతోంది. వింతగా, మిస్టీరియస్‌గా ఉన్న పోస్టర్ సినిమా క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో ఉండబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. రవిబాబు స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సినిమా



కూడా కొత్త ఆలోచనలతో ప్రేక్షకులను ఆశ్చర్యపరచనుందనే అంచనాలు మొదలయ్యాయి. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం ఉదయం 10:30 గంటలకు వెల్లడించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సినిమా టైటిల్‌తో పాటు నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను ఒకేసారి బయటపెట ్టనున్నారు. దీంతో రవిబాబు అభిమానులతో పాటు సినీ వర్గాల్లో కూడా ఈ అప్డేట్ కోసం ఆసక్తి నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌ను ఫ్లయింగ్ ఫ్రాగ్స్ సంస్థ, సురేష్ ప్రొడక్షన్స్ కలిసి నిర్మిస్తున్నాయి. ఈ రెండు ప్రతిష్టాత్మక బ్యానర్లు ఒకే ప్రాజెక్ట్ కోసం చేతులు కలపడం సినిమాపై మరింత నమ్మకాన్ని పెంచుతోంది. కంటెంట్‌కు పెద్దపీట వేసే ఈ బ్యానర్ల నుంచి ఒక నాణ్యమైన సినిమా రాబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు డిఫరెంట్ కాన్సెప్ట్స్, వినూత్న కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రవిబాబు, ఈసారి కూడా అదే స్థాయిలో ఒక కొత్త క్రైమ్ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారని తెలుస్తోంది.

# ఎఐతో పెళ్లి వీడియో

**అభిమానులను ఆట పట్టించిన జగపతిబాబు**

టాలీవుడ్‌లో శోభన్ బాబు తర్వాత అంతటి ఫ్యామిలీ హీరో ఇమేజ్ సంపాదించుకున్న నటుడు జగపతి బాబు. వరుస సూపర్ హిట్ చిత్రాలతో మహిళా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఆయన, సెకండ్ ఇన్నింగ్స్‌లో విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఊహించని స్థాయిలో సత్తా చాటుతున్నారు. అలాంటి సీనియర్ హీరో తాజాగా తన ఇంట్లో ఒక పెద్ద శుభకార్యం జరిగిందంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తన రెండో కూతురి పెళ్లి జరిగిపోయిందంటూ జగపతి బాబు షేర్ చేసిన వీడియో నెట్టింట వేగంగా వైరల్ అయింది. సాధారణంగా సెలబ్రిటీల ఇంట్లో పెళ్లి అంటే భారీ ఏర్పాట్లు, ఆర్భాటం ఉంటాయి. కానీ జగపతి బాబు మాత్రం చాలా సింపుల్‌గా మా రెండో అమ్మాయి పెళ్లయి పోయిందోచ్ అంటూ వీడియోను షేర్ చేయడంతో అభిమానులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. నిజంగానే పెళ్లి జరిగిందా? లేక సరదాగా చేసిన పోస్టా? అన్న సందేహాలు నెటిజన్లలో మొదలయ్యాయి. ఈ సస్పెన్స్‌కు క్లారిటీ వచ్చింది. జగపతి బాబు షేర్ చేసిన వీడియో అసలు నిజమైన పెళ్లి వీడియో కాదు. అది పూర్తిగా ఏఐ టెక్నాలజీతో రూపొందించిన క్రియేటివ్ కంటెంట్ అని తేలింది. టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందిందో చూపించడమే కాకుండా, తన అభిమానులను సరదాగా ఆటపట్టించాలన్న ఉద్దేశంతోనే ఈ వీడియోను షేర్ చేసినట్లు తెలుస్తోంది. జగపతి బాబు ఇప్పటికే తన పెద్ద కూతురు పెళ్లిని చాలా నిరాడంబరంగా, విదేశీయుడితో జరిపించిన విషయం తెలిసిందే. అలాగే తన పిల్లల విషయంలో ఆయన ఎంతో స్వేచ్ఛనిచ్చే తండ్రిగా కూడా పేరుంది. గతంలో ఇచ్చిన పలు ఇంటర్వ్యూల్లో తన రెండో కుమార్తెకు పెళ్లి చేసుకోవాలన్న ఆసక్తి లేదని, అది పూర్తిగా ఆమె వ్యక్తిగత నిర్ణయమని ఆయన స్పష్టంగా చెప్పారు. 'నా పిల్లలు ఏం చేయాలనుకుంటారో అది వారి ఇష్టం. పెళ్లి అనేది వారి ఛాయిస్. నేను ఎప్పుడూ ఒత్తిడి చేయను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో ప్రశంసలు అందుకున్నాయి.మొత్తానికి పెళ్లి కబురు అనుకుని సంబరపడ్డ అభిమానులకు ఇది ఒక స్వీట్ షాక్‌గా మారింది.



## Mana Cinemalu

# హీరోయిన్ల డ్రెస్సింగ్‌పై శివాజీ వ్యాఖ్యలు

**దుమారం రేపుతున్న నటుడి కామెంట్స్**



హీరోయిన్‌ల అందం వాళ్లు వేసుకునే డ్రెస్‌లలో ఉంటుందని నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. నిండుగా దుస్తులు వేసుకుంటేనే గౌరవం ఉంటుందన్న ఆయన వ్యాఖ్యలపై పలువురు సెలబ్రిటీలు మండిపడుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'దండోరా' ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాటుచేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివాజీ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఈవెంట్‌లో యాంకర్ డ్రెస్ సెన్స్ బాగుందని చెప్పిన శివాజీ హీరోయిన్‌ల దుస్తుల గురించి మాట్లాడారు. నటీమణులు కొంచెం డ్రెస్ సెన్స్ పాటించాలి. ఇలా చెబుతున్నందుకు ఏమనుకోవద్దు. మీ అందం మొత్తం నిండుగా వేసుకొనే దుస్తుల్లోనే ఉంటుంది. ఫ్యాషన్ దుస్తులు వేసుకున్నప్పుడు అందరూ బాగున్నాయనే అంటారు. కానీ, లోపల తిట్టుకుంటారు. స్త్రీ అంటే ప్రకృతి. ఎంత అందంగా ఉంటే అంత గౌరవం పెరుగుతుంది మా అమ్మ.. అంటే నటి సావిత్రి ఇప్పటికీ నిండైన రూపంతో గుండెల్లో కనబడుతూ ఉంటుంది. అప్పట్లో సౌందర్య ఈ జనరేషన్‌లో రష్మిక చక్కగా ఉంటారు. గ్లామర్ ఉండాలి.. కానీ దానికి ఒక హద్దు ఉండాలి. స్వేచ్ఛ అనేది అదృష్టం. దాన్ని కోల్పోవద్దు. ప్రపంచ వేదికలపై కూడా చీర కట్టులో వచ్చినవారికే విశ్వసుందరి కిరీటాలు వచ్చాయని శివాజీ అన్నారు. అయితే ఆయన వ్యాఖ్యలు దుమరాం రేపాయి. డ్రెస్సుల గురించి చులకనగా మాట్లాడారని మండి పడుతున్నారు. ఆయన మాట్లాడుతూ నేటితరం హీరోయిన్ల గ్లామర్ ప్రదర్శనపై ఘాటు విమర్శలు చేశారు. 'స్త్రీ అందం చీరకట్టులో, ఒళ్లు కనిపించకుండా వేసుకునే బట్టల్లోనే ఉంటుంది. అలా కాకుండా అభ్యంతరకరంగా బట్టలు వేసుకుంటే అందులో విలువేముంటుంది? అని శివాజీ అన్నారు.

# బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారం

**సిఐడి విచారణకు హాజరైన మంచు లక్ష్మి**



నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారానికి సంబంధించి సినీ నటి మంచు లక్ష్మి మంగళవారం హైదరాబాద్‌లోని సీఐడీ విచారణకు హాజరయ్యారు. లక్డీకపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి చేరుకున్న ఆమెను ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు గానూ అందిన పారితోషికం మరియు కమీషన్ల లావాదేవీలపై అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్నారు. గతంలోనే ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఆమెను విచారించగా, ఇప్పుడు సీఐడీ అధికారులు మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. కాగా, ఇదే వ్యవహారంలో గతంలో టాలీవుడ్ ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్ వంటి వారు కూడా విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. సెలబ్రిటీల ప్రచారం కారణంగా సామాన్యులు ఈ బెట్టింగ్ యాప్‌ల బారిన పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.